

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిచెరువు గ్రామంలో రూ.47లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఇంద్రాసేనారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కొత్తగా మంజూరు అయిన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జక్క సంజీవరెడ్డి, జక్క కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఏతఃం సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, పద్మ, శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, కొండల్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలి

వనస్థలిపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ డీఈఈ దామోదర్‌రావుతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాసిరకం కాకుండా నాణ్యతతో చేపట్టాలన్నారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తిరుమలనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది కాలనీలను పరిశుభ్రంగా ఉంచడం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తిరుమలనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మహేంద్ర, బుచ్చిరెడ్డి, రాజశేఖర్, తరుణ్, హర్ష, దినేష్, మల్లేష్, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

చంపాపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నిక్ కళశాల ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని మూసానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, అటెండర్, స్వీపర్లను, భూపేష్‌గుప్తానగర్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీలను నియమించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఆయన డీఈఓ సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు బొగ్గుల మాధవరెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గజ్జల రాజుగౌడ్, సీనియర్ నాయకులు గౌని వెంకటేష్‌గౌడ్, బొమ్మిడి కిరణ్‌రెడ్డి, చందు, బాల్‌రాజు, అంజి, ప్రవీణ్‌కుమార్, ఆర్‌కే పాల్గొన్నారు.



ఏఐ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది

విద్యార్థినులు కృత్రిమ మేథపై పట్టు పెంచుకోవాలి

సరూర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మారుతున్న కాలానికనుగుణంగా విద్యాభ్యాసంలోని కొత్త అంశాలపై దృష్టిపెట్టాలని బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. కళాశాలలోని విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ విభాగం, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 20రోజుల పాటు ఏఐ(కృత్రిమ మేథ)పై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ క్రమంలో సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు ఏఐ రిసోర్స్ పర్సన్ సంజీవులు పాల్గొని విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా కొత్త కొత్త ఆవిష్కరణలకు అవకాశం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో ఇంటి పన్నులు తగ్గించాలని వినతి

సరూర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నివాసితులకు భారంగా మారిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీర్‌పేట్ కమిషనర్‌ను కలిసి పన్నుల తగ్గింపుపై దృష్టి పెట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అదే విధంగా స్లమ్ ఏరియాలోని ప్రజలకు నీటి బిల్లులు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా ట్రస్ట్ చైర్మన్‌గా కొప్పుల ఏకగ్రీవం

మన్సూరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్‌గా జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రస్టు ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులంతా కలిసి కొప్పులను ఏకగ్రీవం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతుగా సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. సమావేశంలో ఎం.నర్సింహారెడ్డి, సాయినాథ్, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, ఎం.రాంచంద్రారెడ్డి, మోహన్, సత్తయ్య, డీఎస్ రామారావు, ప్రదీప్‌కుమార్, మోహన్‌రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, బి.రత్నాచారి పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వనస్థలిపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ హుడాకాలనీ ఫేజ్-2లోని పోచమ్మతల్లి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. చివరిరోజు సోమవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు ఆనంద్‌రాజ్, ఆలయ కమిటీ అధ్యక్షులు రాములు, శ్రీనివాస్‌రావు, భవానీ ప్రమోద్‌కుమార్, భవానీ అనిత, భవానీ రాజశేఖర్, విజయ, సతీష్‌కుమార్‌గుప్తా, వెంకటేష్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ ఓల్డ్ పోస్ట్‌ఆఫీస్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో పాటు సరూర్‌నగర్ చౌడీ భవనం వద్ద జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కోరారు. సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసిన ఆమె ఈ మేరకు మరోసారి వినతిపత్రం సమర్పించారు. గతంలో జోనల్ కమిషనర్‌ను కలిసిన ఆమె క్షేత్ర స్థాయి పర్యటన చేయమని కోరగా ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించిన విషయం విధితమే. కాగా పనులు ప్రారంభం కాకపోవడంతో మరోసారి వినతిపత్రం సమర్పించారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో

మున్సిపల్ కార్యాలయం కిటకిట..!



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

- 25 శాతం రాయితీకి మొగ్గు చూపుతున్న ప్లాట్ల యజమానులు
- కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు.. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపులు
- మున్సిపల్ పరిధిలో 49,174 దరఖాస్తులు
- వారంలో వెయ్యి మంది ఫీజు చెల్లింపు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం కిటకిటలాడుతోంది. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజుపై 25శాతం రాయితీని ప్రకటించడంతో దరఖాస్తుదారులు పెద్దఎత్తున రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనికి తోడు మున్సిపాలిటీ అధికారులు సైతం ప్రభుత్వం ప్రకటించిన ఫీజు రాయితీపై పెద్దఎత్తున ప్రచారంతో పాటు దరఖాస్తుదారులకు ఫోన్‌చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమాచారం ఇస్తుండడంతో ప్లాట్ల యజమానులు కార్యాలయానికి క్యూకడుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించిన వారం రోజుల్లోనే పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో సుమారు వెయ్యి మంది ప్లాట్ల యజమానులు రాయితీని సద్వినియోగం చేసుకుని ఫీజులు చెల్లించారు. మున్సిపాలిటీ పరిధిలోని 8గ్రామాల్లో మొత్తం 49,174 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మార్చి 31 వరకు ఫీజు రాయితీకి ప్రభుత్వం అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.

ఫీజు చెల్లింపులకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్

ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 8 గ్రామాల్లో సుమారు 49,174 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయి. పెద్ద ఎత్తున దరఖాస్తులు ఉండడంతో అందుకు తగ్గట్టుగానే అధికారులు చర్య లు చేపట్టారు. దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో ఫీజు కట్టించేందుకు మొత్తం 8మంది సిబ్బందిని నియమించారు. అదేవిధంగా 20మంది కార్యాలయం సిబ్బందితో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఫీజు చెల్లించేందుకు వచ్చిన ప్లాట్ల యజమానుల ఎల్ఆర్ఎస్ దరఖాస్తు నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. 2020 సంవత్సరంలో మార్కెట్ రేటు ప్రకారం మొత్తం ఫీజులో ప్రభుత్వం ప్రకటించిన 25శాతం మినహాయింపు ఫీజు తగ్గించి వెంటనే ఆన్‌లైన్‌లో ఫీజును కట్టించుకుంటున్నారు. ఎక్కువ మంది అప్పటికప్పుడే ఫీజు చెల్లిస్తుండగా కొందరు ఆన్‌లైన్‌లో డబ్బులు లేని కారణంగా వాయిదా వేసుకుంటున్నట్లు తెలిసింది.



కార్యాలయం వద్ద క్యూకట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు

సర్వర్ డౌన్‌తో ఇబ్బంది

రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుండడంతో సర్వర్ డౌన్ సమస్య వస్తుంది. సర్వర్ డౌన్ కారణంగా కొంత ఆలస్యం అవుతున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ నంబర్ ఎంట్రీ చేయగానే సర్వర్ సమస్య తలెత్తుతుండడంతో చాలాసేపు ఆగాల్సివస్తోంది. సర్వర్ ప్రాబ్లమ్ ప్రధాన సమస్యగా మారింది.

ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోండి



ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రకటించిన 25శాతం ఫీజు రాయితీ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోండి. ఫీజు రాయితీపై పెద్దఎత్తున ప్రచారం చేస్తు న్నాం. మున్సిపాలిటీ పరిధిలోని 8గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం. అదేవిధంగా కార్యాలయ సిబ్బందితో ప్లాట్ల యజమానులకు ఫోన్లు చేయించి ఫీజు కట్టుకోవాలని చెప్పిస్తున్నాం. ఈ నెల 31వ వరకు అవకాశం ఉంది. - **రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్**



అవగాహన కల్పిస్తున్న టీయూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

ఎల్ఆర్ఎస్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై అవగాహన

ఎల్బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించిందని, ఈ రాయితీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీయూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సూచించారు. సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీఎన్‌జీవో నేత శ్రీనివాస్‌రావు మృతి

- నివాళులర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు

సరూర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని ద్వారకాపురి కాలనీలో నివసించే టీఎన్‌జీవో నాయకుడు, రాష్ట్ర ట్రెజరీ విభాగం ఉద్యోగి రామినేని శ్రీనివాస్‌రావు(60) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతిచెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి తదితరులు సైతం శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.



శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

నివాళులర్పించిన కమిషనర్, డైరెక్టర్

హైదరాబాద్ సిటీ : రామినేని శ్రీనివాసరావు మృతదేహానికి తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్, డైరెక్టర్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, టీఎన్జీవో అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

అంత్యక్రియలకు హాజరైన ఉద్యమ నేతలు

శ్రీనివాస్ అంత్యక్రియలు నాదర్గుల్ శ్మశానవాటికలో జరిగాయి, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని నివాళులర్పించారు, ఉద్యోగసంఘాల పూర్వ నాయకులు స్వామిగౌడ్, దేవిప్రసాద్, శ్రీనివాసగౌడ్, విఠల్, రవీందర్‌రెడ్డి, వి ప్రకాష్, ముజీబ్ శ్రీధర్ దేశపాండే, మధుసూదన్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ పాల్గొని నివాళులు అర్పించారు. సహచరి సునీత, ఇద్దరు కుమారులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కాటమయ్య రక్షణ కవచాలు లేకనే ప్రమాదాలు

- తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం
- ప్రమాదాలకు గురైన ముగ్గురికి 'సుప్రజా'లో ఉచిత చికిత్స

మన్సూరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల రక్షణకు తొమ్మిది నెలల క్రితం ప్రకటించిన కాటమయ్య రక్షణ కిట్లు నేటికీ అందక ఎంతో మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురై నాగోల్‌లోని సుప్రజా ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స పొందుతున్న జనగామ జిల్లా చిటకొండూరు గ్రామానికి చెందిన బాల్ని శ్రీనివాస్, పెద్దమడ్డూరుకు చెందిన గోడిశాల శ్రీనివాస్‌గౌడ్, గొల్లపల్లికి చెందిన తీగల పరుషరాములు ముగ్గురిని కేజీకేఎస్ సభ్యులు సోమవారం ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్‌కుమార్‌గౌడ్, వైద్యులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో 2.50లక్షల గీత కార్మికులు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వారందరికీ వెంటనే కాటమయ్య రక్షణ కవచాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు

ప్రతి గీత కార్మికుడికి ఉచిత చికిత్స అందిస్తాం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గీత కార్మికుల్లో ఎవరు ప్రమాదాలకు గురైన తమ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స అందిస్తున్నామని సుప్రజా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిగ విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

ఘనంగా హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవాలు

వనస్థలిపురం : హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్‌బాబు తెలిపారు. అసోసియేషన్ ఏర్పడి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వనస్థలిపురంలోని ఓ కాన్ఫరెన్స్ హాల్లో స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ యాభై ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లని ఎదుర్కొని లారీ సప్లయర్స్ అసోసియేషన్ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ అభ్యున్నతికి తోడ్పాటు అందించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, కోశాధికారి కె.శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.యాదగిరిరెడ్డి, యు.వెంకటేష్, సహాయ కార్యదర్శి బి.ధర్మారావు, కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ.అమీద్, మోహన్‌రెడ్డి, శేషు పాల్గొన్నారు.

భవనం మీద నుంచి పడి వ్యక్తి మృతి

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం మీద నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పూతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన బొడ్డు కృష్ణ(50) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి 20సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి సరూర్‌నగర్ బాపునగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా శనివారం కృష్ణ భార్య జయమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి రామంతపూర్‌లోని బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లింది. ఒంటరిగా ఉన్న కృష్ణ ఆదివారం పీ అండ్ టీ కాలనీకి వెళ్లాడు. కోదండరాంనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం మీద నుంచి కిందపడి ఉన్నాడు. గమనించిన స్థానికులు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అయితే కృష్ణ ఆ భవనం వద్దకు ఎందుకు వచ్చాడన్న కారణం తెలియలేదు. నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్థుకు ఎందుకు వెళ్లాడు? అన్నది తేలాల్సి ఉన్నది. ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వంట నూనె ప్యాకింగ్ కేంద్రంపై పోలీసుల దాడి



వంట నూనె ప్యాకింగ్ కేంద్రం నుంచి వివరాలు సేకరిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చాదర్‌ఘాట్ : బ్రాండెడ్ కంపెనీల పేరుతో వంట నూనె ప్యాకింగ్ చేస్తున్న కేంద్రంపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి సోమవారం దాడి చేశారు. మలక్‌పేట మార్కెట్ ఆవరణలో ఉన్న వంట నూనె ప్యాకింగ్ కేంద్రంలో బ్రాండెడ్ కంపెనీల లేబుల్‌తో నకిలీ వంట నూనెను ప్యాకింగ్ చేస్తున్నట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పలు బ్రాండెడ్ కంపెనీల పేరుతో ప్యాకింగ్ చేసిన వంట నూనె శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆలేటి శృతికి అప్పగించారు. వాటిని తాను పరిశీలనకు పంపి ఏఏ బ్రాండెడ్ కంపెనీల వంట నూనెను కల్తీచేసి ఆయా కంపెనీల లెబుల్‌లతో ప్యాకింగ్ చేస్తున్నారోనని నివేదిక వచ్చిన తర్వాత సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు చాదర్‌ఘాట్ పోలీసులకు అందజేస్తామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

2026 నాటికి రూ. 10వేల కోట్ల టర్నోవర్

- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్


హైదరాబాద్ సిటీ: వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ.10వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కా ర్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ. 3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డా లర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50వేల మంది ఉద్యోగుల నిబద్ధత, దృఢ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైనదన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కెకె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

నాకోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా..

- భర్తకు వీడియో కాల్ చేసిన భార్య
- రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు ● నేటికీ దొరకని ఆచూకీ

బాలానగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. అందుకే కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నాకోసం వెతకకండి. బాబును స్కూలు వద్ద దింపి వెళ్తున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్‌బాబు, ఉమారాణి (40)దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యధతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం(మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళ్తున్నా.. నాకోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ఛాఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు



ఉమారాణి

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతుకున్నట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు.

అణగారిన వర్గాల్లో అక్షర దీపం సావిత్రీబాయి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అణగారిన వర్గాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేసి అక్షర బాట వేసిన మహనీయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్స్ వద్ద గల ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, రుద్ర యాదగిరినేత, విజయ్‌భాస్కర్ రెడ్డి, సతీష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్స్ వద్ద గల సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఆమె వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు విచ్చేసి బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్‌తో కలిసి సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మేడిగ శ్రీధర్, శనిగరపు స్వామి, చామకూర రాజు, కే వీ గౌడ్, బొంగు వెంకటేష్‌గౌడ్, నకరికంటి శ్రీనివాస్, నేరడ సైదులు, సోమేష్ కుమార్, నరేష్‌చారి పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ డివిజన్ జింకలబావికాలనీలో నిర్వహించిన సావిత్రీబాయి పూలే వర్ధంతిలో మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్, కుమ్మర(శాలివాహన) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాజిగిరి దయానంద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ఆలయ మాజీ సభ్యులు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మున్నూరుకాపు సంఘం నాయకుడు ఆకుల అరవింద్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు నోముల కబీర్‌దాస్‌గౌడ్, సాయిత్రిబాయిపూలే సం క్షేమ సంఘం అధ్యక్షురాలు కల్పన లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : సాయిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-౩లో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్వసేవా సంఘ్ జిల్లా కన్వీనర్ సైదులుముదిరాజ్, వినోద్‌నాయక్, రామకృష్ణ, రమేష్‌ప్రియ, అన్నపూర్ణ, సాయిలు, నారాయణ, జ్యోతి, వీరేష్, లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్ వద్ద గల సాయిత్రీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సరూర్‌నగర్ జేబీ కాలనీలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బేర బాలకిషన్, మల్కాజిగిరి దయానంద్ తదితరులు



హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య తదితరులు